

సోమశిలలో 10.12 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 10.12 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 316 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,910
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,727
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,929
సవర (8 గ్రాములు)	రూ.55,432

గరిష్టం/కనిష్టం
37.4 /29.6

వాతావరణం

గాలిలో తేమ 62 శాతంగా శుక్రవారం నమోదైంది. జిల్లాలో అక్కడక్కడా వర్షాలు శనివారం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

సా..గుతున్న నిర్మాణం


కందుకూరు పట్టణ బైపాస్‌లో అసంపూర్తిగా ఉన్న మేజర్ బ్రిడ్జి

వైఎస్సార్ జిల్లా మైదుకూరు నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు నిర్మిస్తున్న నూతన జాతీయ రహదారి 167బీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మొత్తం 189 కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన రోడ్డు నిర్మాణంలో మొదటి దశలోనే తీవ్ర జాప్యం నెలకొంది. వలేటివారిపాలెం మండలం మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు మొదటి దశలో చేపట్టనున్న 45.73 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులు ఏడాదిన్నరగా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకు 70 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు చెప్తున్నా, గడువులోపు పూర్తవ్వడం అనుమానమే. ఈ పరిణామాలతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – కందుకూరు

167బీ జాతీయ రహదారి పనుల్లో జాప్యం

- 189 కిలోమీటర్ల మేర ఏర్పాటుకు చర్యలు
- ఏడాదిన్నరగా జరుగుతూనే ఉన్న మొదటి దశ
- 70 శాతం పూర్తయ్యాయంటున్న ఎన్‌హెచ్ అధికారులు

మొదటి ప్యాకేజీ ఇలా..

167బీ జాతీయ రహదారి పనుల ప్రారంభానికే దాదాపు నాలుగేళ్లు పట్టింది. గతేడాది ప్రారంభంలో పనులను జాతీయ రహదారుల శాఖ అధికారులు ప్రారంభించారు. ఇందులో భాగంగా మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు 45.73 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.310 కోట్ల అంచనాలతో టెండర్లను పిలవగా, 23 శాతం లెస్‌తో రూ.240 కోట్లకు వల్లభనేని కన్‌స్ట్రక్షన్స్ సంస్థ దక్కించుకుంది. అయితే పనులను ఏడాదిన్నరగా చేస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు 70 శాతం పూర్తయ్యాయని ఎన్‌హెచ్ అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో కీలకమైన పనులు ఎక్కడివక్కడే ఉన్నాయి.

అసంపూర్తిగా వంతెనల నిర్మాణం

పలుచోట్ల భారీ వంతెనల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం మాలకొండ నుంచి కందుకూరు వరకు ఉన్న రోడ్డుకు తారు వేసే పనులు చేస్తున్నారు. అయితే సింగరాయకొండ నుంచి కందుకూరు మధ్య రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. కందుకూరు నుంచి సింగరాయకొండ మధ్యలో 12 కిలోమీటర్ల రోడ్డును నాలుగు వరుసలుగా నిర్మించాలని భావించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా, అనుమతులు రాకపోవడంతో మూడు వరుసల నిర్మాణానికే పరిమితమయ్యారు.

ప్రారంభం కాని ఫ్లైఓవర్ పన

వాస్తవానికి ఈ రోడ్డు సీటీఆర్‌ఐ మధ్య నుంచి వెళ్తుంది. మొదట్లో రోడ్డు అలైన్‌మెంట్ మేరకు ఇక్కడ ఫ్లైఓవర్‌ను నిర్మించాల్సిన అవసరం లేదు. అయితే సీటీఆర్‌ఐ అధికారుల విజ్ఞప్తి మేరకు ఇక్కడ భారీ ఫ్లైఓవర్‌ను నిర్మించాల్సి వస్తోంది. ఇప్పటి వరకు ఈ పనులు ప్రారంభం కాలేదు. మరోవైపు కందుకూరు పట్టణం ఉత్తరం వైపు 8.9 కిలోమీటర్ల మేర రోడ్డు అర్థచంద్రాకారంలో బయట నుంచి వెళ్తుంది. ఈ పనులూ అసంపూర్తిగానే ఉన్నాయి. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన గడువు ముగిసినా, మరోసారి పొడిగించారని సమాచారం. పనులను సెప్టెంబర్ నాటికి పూర్తి చేస్తామని ఎన్‌హెచ్ అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇది ఏ మాత్రం సాధ్యమయ్యే దాఖలాల్లేవు.

ఇదీ రోడ్డు నిర్మాణ ప్రతిపాదన

మైదుకూరు సమీపంలోని ఎన్‌హెచ్ 67 నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వద్ద ఉన్న ఎన్‌హెచ్ 16ని కలుపుతూ 189 కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డును జాతీయ రహదారి 167బీగా గుర్తించారు. జాతీయ రహదారి ప్రమాణాలకు అనుగుణంగా రూ.రెండు వేల కోట్లతో విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ కింద నెల్లూరు జిల్లా మాలకొండ నుంచి ప్రకాశం జిల్లా సింగరాయకొండ వరకు.. రెండో ప్యాకేజీ కింద మాలకొండ నుంచి సీఎస్‌పురం.. మూడో ప్యాకేజీ కింద సీఎస్‌పురం నుంచి కడప.. నాలుగో ప్యాకేజీ కింద కడప నుంచి ముదిరెడ్డిపల్లి జంక్షన్ వరకు రహదారిని నిర్మించాల్సి ఉంది. ముదిరెడ్డిపల్లి నుంచి తిరిగి మైదుకూరు వరకు రోడ్డును నిర్మించాలి. ఇలా దాదాపు 189 కిలోమీటర్ల మేర మూడు వరుసల రోడ్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. మొదటి ప్యాకేజీ పనులు 70 శాతం పూర్తి కాగా, మిగిలినవి జరుగుతున్నాయి.


రోడ్డు నిర్మాణంలో ఉపయోగిస్తున్న శుద్ధ మట్టి


కొద్దిపాటి వర్షానికే దెబ్బతింటున్న మార్జిన్

నాణ్యతపై విమర్శలు

పనుల నాణ్యతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి సంబంధించిన గ్రావెల్ విషయంలో నాణ్యత లేని మట్టిని ఉపయోగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదు. తెల్లటి శుద్ధ మట్టిని ఉపయోగిస్తున్నారు. దీంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డు మార్జిన్లు పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఎర్రమట్టితో కూడిన గ్రావెల్‌ను వినియోగించాల్సి ఉన్నా, పలు లేయర్లలో పూర్తిగా శుద్ధ మట్టిని ఉపయోగిస్తున్నారు. భారీ వంతెనలను నిర్మిస్తున్న ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

పూర్తిగా అందని పరిహారం

రోడ్డు నిర్మాణానికి దాదాపు 110 ఎకరాలను అధికారులు సేకరించారు. అయితే నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారాన్ని చెల్లించలేదు. ఇదే అంశమై కొందరు రైతులు ఇటీవల ఆందోళన వ్యక్తం చేశారు. కాగా ఇప్పటి వరకు 90 శాతం మేర పరిహారాన్ని చెల్లించామని, మరో పది శాతమే ఇవ్వాల్సి ఉందని అధికారులు చెప్తున్నారు.

రోడ్డు నాణ్యత బాధ్యత కాంట్రాక్టర్‌దే

ఎన్‌హెచ్ 167బీ జాతీయ రహదారి పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. మాలకొండ నుంచి సింగరాయకొండ వరకు రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. సెప్టెంబర్, నవంబర్ నాటికి పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులతో రోడ్డు నిర్మాణంలో కొంత జాప్యం జరిగింది. ఐదేళ్ల వరకు రోడ్డు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దే. నాణ్యత విషయంలో రాజీపడేది లేదు. పనులను పర్యవేక్షించి అవసరమైన సూచనలు చేస్తాం.

– సుమన్, జేఈ, ఎన్‌హెచ్

న్యూస్‌రీల్

'డీకేడబ్ల్యూ'లో అడ్మిషన్లు ప్రారంభం


అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థినులు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియను ఆన్‌లైన్లో ప్రారంభించామని ప్రిన్సిపల్ గిరి తెలిపారు. ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల పది వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో బీటీసీ (ఎమ్మెల్టీ) కోర్సును ప్రారంభించామని వివరించారు. వీఎస్‌యూ పరిధిలోని విద్యార్థినుల కోసం బీఎస్సీ మ్యాథమేటిక్స్, కెమెస్ట్రీ ప్రోగ్రామ్‌లో నాలుగో సంవత్సరం హానర్స్ డిగ్రీని ప్రారంభించామని చెప్పారు. డాక్టరేట్లు పొందిన 34 మంది అధ్యాపకులు ఉన్నారని, కళాశాలలో హాస్టల్ సౌకర్యం ఉందని తెలిపారు. విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సహకారంతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలకు 86397 34668 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈఓ సస్పెన్షన్

నెల్లూరు(వేదాయపాళెం): ఎస్సీ కార్పొరేషన్ ఈఓ సెల్విని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్లో కొన్ని రకాల ఉద్యోగోన్నతులకు సంబంధించిన నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. అవినీతి జరిగిందనే ఆరోపణలొచ్చాయి. దీనిపై గత కలెక్టర్ హరి నారాయణన్ విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. దీంతో సస్పెన్షన్ వేటు వేశారు.

33 వేల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని కుక్కలకు ఉచితంగా వేసేందుకు అవసరమైన 33 వేల యాంటీ రేబిస్ టీకాలను సిద్ధం చేశామని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వీటిని వేయనున్నామని చెప్పారు. అన్ని పశు, ప్రాంతీయ పశు వైద్యశాలలు, వెటర్నరీ పాలిక్లినిక్‌లలో వీటిని వేయనున్నామని వెల్లడించారు.

సత్ఫలితాలిస్తున్న కార్యక్రమాలు


ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సభ్యులు

నెల్లూరు(పొగతోట): జల్‌శక్తి అభియాన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో సత్ఫలితాలను ఇస్తున్నాయని, పనులను సక్రమంగా పూర్తి చేస్తున్న జిల్లా యంత్రాంగాన్ని జల్‌శక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ సచ్చీంద్రకుమార్ పట్నాయక్ అభినందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కేంద్ర బృందం మూడు రోజుల పాటు పర్యటించి జల్‌శక్తి ఆధ్వర్యంలో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ క్రమంలో డ్వామా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను బృంద సభ్యులు శుక్రవారం తిలకించారు. ఈ సందర్భంగా జాయింట్ సెక్రటరీ మాట్లాడారు. చెక్‌డ్యామ్‌లు, పంటకుంటలు, డ్రాగన్ ఫ్రూట్, ఇతర తోటల పెంపకం అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ప్రస్తుతం చేపడుతున్న పనులను రానున్న రోజుల్లో మరోసారి వచ్చి పరిశీలిస్తామని తెలిపారు. డ్వామా ఇన్‌చార్జి పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడి రాక నేడు

నెల్లూరు(దర్గామిట్ట): జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యుడు పీపీ వావా నెల్లూరుకు శనివారం రానున్నారు. జిల్లాలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పనితీరు.. ఎస్సీ, ఎస్టీ వర్గాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను తెలుసుకోనున్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఇతర అధికారులతో సమావేశాన్ని మధ్యాహ్నం 12కు నిర్వహించనున్నారు. అనంతరం తిరుపతికి పయనమవ్వనున్నారు.

బ్యాంక్ పథకాలను చేరువ చేయాలి

- జేసీ సేదు మాధవన్


సమీక్షిస్తున్న సేదు మాధవన్

నెల్లూరు(దర్గామిట్ట): కేంద్ర సహకార బ్యాంక్ పథకాలను సాధారణ ప్రజలకు చేరువ చేయాలని జేసీ సేదు మాధవన్ పేర్కొన్నారు. నగరంలోని డీసీసీబీలో నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ లిమిటెడ్ బోర్డు మీటింగ్‌ను శుక్రవారం నిర్వహించారు. బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి హోదాలో హాజరైన ఆయన బ్యాంక్ పనితీరును సమీక్షించారు. వ్యవసాయ అవసరాలకు రుణాల మంజూరును వేగవంతం చేసేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులకు సంబంధించిన కర్షకమిత్ర, పీఎం సూర్యఘర్, పీఎం విశ్వకర్మ, కొత్త డిపాజిట్ లింక్ క్రెడిట్ ప్రొడక్ట్ తదితర పథకాలపై అన్ని శాఖలకు అవగాహన కల్పించాలని కోరారు. బ్యాంక్ ఆవరణలో ఖాళీ చేయని దుకాణాలను తక్షణమే తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్యాంక్ సీఈఓ శ్రీనివాసరావు, డీసీఓ గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపింగ్ యార్డులో పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

మర్రిపాడు: మర్రిపాడులోని ఇసుక డంపింగ్ యార్డును ఆత్మకూరు ఆర్డీఓ మధులత, మైనింగ్ డీడీ శ్రీనివాస్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. స్థానిక డంపింగ్ యార్డు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే అంశమై సాక్షిలో కథనం ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించారు. యార్డులో ఇసుక ఏ మేరకు ఉందో అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆర్డీఓ మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గానూ పటిష్ట చర్యలను చేపడుతున్నామని వివరించారు. 24 గంటలూ వీఆర్‌ఓ, వీఆర్‌ఏలతో పర్యవేక్షించేలా చూస్తామన్నారు. అనంతరం శ్రీనివాస్‌కుమార్ మాట్లాడారు. అనుమతుల్లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాగా వాహనాలు లోపలికి వెళ్లకుండా డంపింగ్ యార్డు చుట్టూ కందకాలను తీయించారు.



రీజియన్‌కు కొత్తగా 110 బస్సులు

ఉదయగిరి: నెల్లూరు రీజియన్‌కు కొత్తగా 110 బస్సులు రానున్నాయని ఆర్టీసీ ఆర్‌ఎం విజయరత్నం పేర్కొన్నారు. ఉదయగిరి ఆర్టీసీ డిపోను శుక్రవారం సందర్శించారు. డిపోలోని వివిధ విభాగాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉదయగిరి నుండి బెంగళూరు, హైదరాబాద్‌కు స్లీపర్ బస్సులను త్వరలో నడపనున్నామని వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ బట్టి అవసరమైన బస్సులను నడుపుతామన్నారు. ఉదయగిరి నుంచి తెలంగాణలోని జిల్లాలకు బస్సులను నడిపేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఆర్టీసీలో ఏర్పడే ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. నెల్లూరు రీజియన్ పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తామని తెలిపారు. డీఎం శ్రీనివాసరావు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాషా సాహెబ్, మెకానికల్ ఫోర్స్ హనుమాన్‌సింగ్, అసిస్టెంట్ మేనేజర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


టైర్ల విభాగాన్ని పరిశీలిస్తున్న విజయరత్నం

అనర్హుల గుర్తింపునకు సర్వే

- పీఎం కిసాన్ లబ్ధిదారుల జాబితాపై విచారణ
- ఐదు శాతం మందిని పరిశీలించాలని ఆదేశాలు
- జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య 2,19,766
- 14,541 మంది రైతుల వివరాల సేకరణ

దుత్తలూరు: అన్నదాతల కోసం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిలో అనర్హుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 14,541 మంది వివరాలను సేకరించాల్సి ఉండగా, ఇప్పటికే 8,974 మంది లబ్ధిదారుల వివరాలను సేకరించి అప్‌లోడ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్రమిస్తున్న సాయంతో కలిపి ఏడాదికి రూ.13,500 చొప్పున జిల్లాలోని రైతులకు చెల్లించారు. ఈ తరుణంలో లబ్ధిదారుల జాబితా పరిశీలన, అనర్హుల గుర్తింపు, తొలగింపునకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఈ మేరకు మొత్తం లబ్ధిదారుల్లో ఐదు శాతం మంది వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పరిశీలించాల్సిన రైతుల పేర్లను సైతం పంపింది.

వివరాల సేకరణలో నిమగ్నం

2022 – 23, 2023 – 24లో పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందిన వారి వివరాలను వ్యవసాయ శాఖ సిబ్బంది ఆరా తీస్తున్నారు. లబ్ధిదారులు భౌతికంగా ఉన్నారా.. అనర్హులు ఎవరైనా ఉన్నారాననే వివరాలను సేకరిస్తున్నారు. లబ్ధిదారుల ఫొటో తీసి పీఎం కిసాన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాస్తవానికి అర్హుల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏటా నిర్వహిస్తోంది. జిల్లాలో పీఎం కిసాన్‌కు సంబంధించిన లబ్ధిదారులు 2,19,766 మంది ఉన్నారు. వీరికి గత నెల్లో కేంద్ర ప్రభుత్వం రూ.రెండు వేల చొప్పున మొత్తంగా రూ.44 కోట్లను ఖాతాల్లో జమ చేసింది. ఇలా ఏడాదికి కేంద్ర ప్రభుత్వం రూ.ఆరు వేల చొప్పున.. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రూ.7,500ను జమ చేసింది.


లబ్ధిదారుడి ఫొటో తీస్తున్న వ్యవసాయ సిబ్బంది

పరిశీలిస్తున్న అంశాలు

- ఆదాయ పన్ను కడుతున్న వారు లబ్ధి పొందుతున్నారా..
- భూమి లేని వారు.. ప్రభుత్వోద్యోగం చేస్తూ లబ్ధి పొందుతున్న వారు..
- భూమి వివరాలు సరిపోకపోవడం
- 2019 తర్వాత భూమి రిజిస్ట్రేషన్ కావడం
- ఒకే కుటుంబంలో ఇద్దరికి వర్తించడం
- ఆధార్ మనుగడలో లేకపోవడం
- స్థానికంగా ఉండకపోవడం
- డూప్లికేట్ రిజిస్ట్రేషన్
- భూమి సాగుచేయకుండా వదిలేయడం
- 18 ఏళ్లలోపు వారికి వర్తిస్తోందా..

ప్రభుత్వ ఆదేశాల మేరకు సేకరణ



2022 – 23, 2023 – 24 సంవత్సరాలకు సంబంధించిన పీఎం కిసాన్ పథకం లబ్ధిదారుల్లో ఐదు శాతాన్ని పరిశీలించాలని ఆదేశాలొచ్చాయి. జాబితాను సైతం పంపారు. వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– వెంకటసుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి, దుత్తలూరు

బాలికపై మారుతండ్రి దాష్టీకం

- దుస్తులు కొనిస్తానని తీసుకెళ్లి లైంగిక దాడి
- నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): భార్యపై కక్ష సాధించాలనే ఉద్దేశంతో కుమార్తెపై మారు తండ్రి లైంగిక దాడికి పాల్పడ్డారు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతికత ఆధారంగా బాలికను గుర్తించారు. ఆమెను సంరక్షించి విచారించగా లైంగిక దాడి విషయం వెలుగులోకి రావడంతో మారు తండ్రిని అరెస్ట్ చేశారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో కేసు పూర్వాపరాలను నెల్లూరు నగర, రూరల్ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీనివాసరెడ్డి శుక్రవారం వెల్లడించారు. తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాళేనికి చెందిన ఓ మహిళకు ఇది వరకే వివాహమైంది. విభేదాల కారణంగా భర్త నుంచి విడిపోయి కుమారుడు, మైనర్ కుమార్తెతో కలిసి జీవిస్తున్నారు. కూలీ పనులు చేసుకొని వారిని చదివించుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రకాశం జిల్లా కనిగిరి మండలం బల్లేపల్లిలోని విశ్వనాథపురానికి చెందిన మల్లికార్జునతో మూడేళ్ల క్రితం రెండో వివాహమైంది. వీరు వెంకన్నపాళెంలోనే ఉంటూ పనులు చేసుకోసాగారు. ఈ తరుణంలో దంపతుల నడుమ విభేదాలు పొడచూపాయి. దీంతో భార్యపై కక్ష సాధించాలని మల్లికార్జున నిర్ణయించుకున్నారు. గత నెల 29న పాఠశాలకు వెళ్లిన కుమార్తెకు దుస్తులు కొనిస్తానని మల్లికార్జున మాయమాటలు చెప్పి బైక్‌పై తన వెంట స్వగ్రామమైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం బల్లేపల్లి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. అనంతరం లైంగిక దాడికి పాల్పడ్డారు. పాఠశాలకు వెళ్లిన కుమార్తె ఎంతకీ రాకపోవడంతో గాలింపు చర్యలను తల్లి చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో మరుసటి రోజున టీపీగూడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో బాలికను మల్లికార్జున తీసుకెళ్లారని వెల్లడవడంతో సాంకేతికత ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. బల్లేపల్లి అటవీ ప్రాంతంలో నిందితుడు ఉన్నారనే సమాచారంతో ప్రత్యేక బృందం అక్కడికి గురువారం వెళ్లింది. పోలీసుల రాకను గమనించిన దుండగుడు పరారయ్యారు. దీంతో బాలికను సంరక్షించి విచారించగా, మల్లికార్జున దాష్టీకాన్ని తెలియజేయడంతో మిస్సింగ్ కేసును పోక్సో కేసుగా మార్పు చేశారు. బాలికను తల్లికి అప్పగించి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మల్లికార్జునను శుక్రవారం అరెస్ట్ చేశామని డీఎస్పీ వెల్లడించారు. సీసీఎస్ డీఎస్పీ రామకృష్ణాచారి, కృష్ణపట్నం పోర్టు సీఐ వెంకటరెడ్డి, టీపీగూడూరు ఎస్సై జంపాని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలపైనే ధ్యాస.. కునుకేసిన గస్తీ

ఊరికి వెళ్లొచ్చే లోపే ఇళ్ల తాళాలు పగులగొడుతున్నారు. బీరువాల్లోని నగదు, నగలు మాయమవుతున్నాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దొంగలు రెచ్చిపోతున్నారు. జిల్లాలో వరుస చోరీలు జరుగుతున్నా పోలీసుల గస్తీ మాత్రం స్టేషన్ దాటడం లేదు. పోయింది తమ సొమ్ము కాదు కదా.. అన్నట్లుగా కొందరు వ్యవహరిస్తున్నారు. బదిలీపై వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాం.. మనకెందుకులే అని పలువురు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

- జిల్లాలో ఆగని దొంగతనాలు
- పట్టపగలే ఇళ్లను ఊడ్చేస్తున్న వైనం
- బదిలీ యత్నాల్లో కొందరు పోలీస్ అధికారులు
- చోరీల గురించి పట్టించుకోవడంలేదని విమర్శలు

నెల్లూరు(క్రైమ్): పోలీస్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది శాంతిభద్రతలను గాలికొదిలేశారని విమర్శలు వస్తున్నాయి. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. దీంతో అనేకమంది పోలీసు అధికారుల ధ్యాసంతా ఏ ఊరిలో పోస్టింగ్ వేయించుకోవాలనే విషయంపైనే ఉంది. ఈ నేపథ్యంలో పోలీసింగ్ గాడి తప్పి ప్రజల భద్రత గాలిలో దీపంలా మారింది. ఇది దొంగలకు వరంలా మారింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఇళ్లు, దుకాణాలు, దేవాలయాల్లో సొత్తును దోచుకెళుతున్నారు. దొంగతనాల కట్టడిలో పోలీసు యంత్రాగం విఫలమైందన్న ఆరోపణలున్నా అధికారుల స్పందన అంతంతమాత్రంగానే ఉందని ప్రచారం జరుగుతోంది.



వెంకటాచలం మండలం జైన దేవాలయంలో దొంగలు పగులగొట్టిన హుండీ (ఫైల్)

ఇటీవల

- మనుబోలు అంబేడ్కర్ నగర్‌లో ఆర్టీసీ కానిస్టేబుల్ ఇంట్లో రూ.50 వేల నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలను దుండగులు దోచుకెళ్లారు.
- సంగంలో సోమవారం తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. ఎం.రామారావు ఇంట్లో రూ.3 లక్షలు విలువైన రెండు బంగారు గాజులు, రూ.4 వేల నగదు, పి.వెంకటేశ్వర్లుతోపాటు పోలీసు ఉద్యోగి ఇంట్లో రూ.50 వేల నగదు, రెండు గ్రాముల బంగారు ఉంగారం, రాళ్లచెలిక బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల ఎదురుగా ఉన్న హాజరత్తయ్య ఇంట్లో రూ.3 వేల నగదు, వెండి పట్టీలు, ఎస్టీ కాలనీలోని శీనయ్య ఇంట్లో రూ.50 వేల నగదును దోచుకెళ్లారు.
- బుధవారం తెల్లవారుజామున కాకుటూరులోని జైన దేవాలయంలో దొంగతనం జరిగింది.


సంగంలో చోరీకి సంబంధించి వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు (ఫైల్)

అందినంత..

జిల్లాలో 5 సబ్‌డివిజన్లు, 12 సర్కిల్స్, 11 అర్బన్ పోలీసుస్టేషన్లున్నాయి. వీటి పరిధిలో ఏదో ఒక ప్రాంతంలో రోజూ దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలని, పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని, దొంగతనాలను కట్టడి చేయాలని పోలీసు ఉన్నతాధికారులు పదేపదే జారీ చేస్తున్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు నామమాత్రంగానే ఉంది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కొందరు పోలీసు అధికారుల బదిలీలు నేడు, రేపు అనే ప్రచారం జోరుగా సాగుతోంది. దీంతో వారు తమ పోస్టింగ్‌లను పదిలం చేసుకునేందుకు, మరోచోటుకు వెళ్లేందుకు ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉండగా, మరికొందరు ఎంత త్వరగా బదిలీలు జరిగితే జిల్లా నుంచి వెళ్లిపోయేందుకు ఎదురుచూస్తూ విధులను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. అధికార పార్టీ పెద్దలు కూడా తమకు కావాల్సిన వారిని ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలుగా నియమించుకునే పనిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో నిఘా కునుకేసింది. ఇదే సమయమని భావించిన దొంగలు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తూ అందిన కాడికి దోచుకెళ్తున్నారు. దొంగతనానికి కాదేది అనర్హమంటూ దేవాలయాలను కొల్లగొడుతున్నారు. వాహన దొంగతనాలు గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు.

నిర్లక్ష్యంగా..

వరుస దొంగతనాలు ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కష్టపడి సంపాదించుకున్నదంతా పోగొట్టుకున్న బాధితులు తేరుకోలేకపోతున్నారు. సొత్తు పోగొట్టుకున్న వారు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా రికవరీ చేయడంలో, కేసులు నమోదు చేయడంలోనూ కొందరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. పలువురైతే ఎలాగూ బదిలీపై వెళ్తున్నాం కదా అని తమకేం పట్టనట్లుగా ఉంటున్నారనే చర్చ జరుగుతోంది. దొంగతనాల కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించే క్రైమ్ పార్టీల్లో కొందరు అసలు విధులను వదిలి అధికారుల సొంత పనులు, ఆదాయవనరులు సమకూర్చడంలో బిజీగా ఉన్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్నీ పోలీసుస్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలి. పగలు, రాత్రి బీట్లు పటిష్టంగా అమలు చేయాలి. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలి. నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలి. శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీని పెంచాలి. దొంగతనాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. నేర నియంత్రణ చర్యల్లో ప్రజలనూ భాగస్వాములను చేయడం ద్వారా నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

ఆనం, నారాయణ భేటీ

నెల్లూరు(దర్గామిట్ట): మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ శుక్రవారం భేటీ అయ్యారు. నెల్లూరులోని సంతపేటలో ఉన్న ఆనం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కలెక్టర్ ఆనంద్‌కు పలు సూచనలు చేశారు. అనంతరం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో చేయాల్సిన పనుల గురించి ఎమ్మెల్యేలతో చర్చించి ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. నెల్లూరు నగరంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నారాయణ మాట్లాడుతూ లేఅవుట్లకు సంబంధించి అన్ని పరిశీలించి వారం రోజుల్లోనే అనుమతి ఇవ్వాలని అధికారులకు చెప్పామన్నారు. త్వరలోనే ఇరిగేషన్ శాఖ మంత్రి జిల్లాకు రానున్నారని సోమశిల జలాశయం, ఇతర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్తామన్నారు. వారి వెంట రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య ఉన్నారు.


మాట్లాడుతున్న మంత్రి నారాయణ, చిత్రంలో రామనారాయణరెడ్డి

తపాలా కార్యాలయం ఎదుట ఆందోళన

ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్టాఫీసు పరిధిలోని పలువురు ఖాతాదారులు శుక్రవారం ఉదయగిరి సబ్‌పోస్టాఫీసు ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పుల్లాయపల్లి బ్రాంచ్ పోస్టాఫీసులో బోడబండ, పుల్లాయపల్లి గ్రామాలకు చెందిన పలువురు ఆర్‌డీ రూపంలో నగదును దాచుకోవడం జరిగిందన్నారు. పోస్టుమాస్టర్ కె.నాయబ్ రసూల్ ఖాతాదారుల నగదు విత్‌డ్రా చేసేందుకు పాన్‌కార్డు అవసరమని నమ్మించాడన్నారు. విత్‌డ్రా ఫారాలపై సంతకాలు చేయించుకుని నగదు డ్రా చేసుకున్నాడన్నారు. అతడిని అరెస్ట్ చేసి ఖాతాదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వేగూరి సాయికృష్ణ వారితో చర్చించారు. నగదు స్వాహాపై విచారణ చేస్తున్నామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కాకు వెంకటయ్య, స్థానికుడు కల్లూరి కృష్ణారెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.


ఆందోళన చేస్తున్న నాయకులు, ఖాతాదారులు

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.55
సన్నవి : రూ.40
పండ్లు : రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 135
లేయర్ (లైవ్)	: 115
బ్రాయిలర్ చికెన్	: 242
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 195



వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించండి

- పార్టీ శ్రేణులకు బుర్రా పిలుపు

కందుకూరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈనెల 8వ తేదీన నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. మహానేత వైఎస్సార్ హయాంలో ప్రజలకు జరిగిన మేలు, సంక్షేమాన్ని గుర్తు చేస్తూ.. సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మండల కేంద్రాలతోపాటు, రాజన్న విగ్రహం ఉన్న ప్రతి గ్రామంలో పెద్దఎత్తున జయంతిని నిర్వహించాని సూచించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో రోగులకు పండ్లు పంపిణీ, అన్నదానం, దివ్యాంగులకు చేయూత, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కండలేరులో 6.303 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 6.303 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 5 క్యూసెక్కులు, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో వర్షం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. నెల్లూరు నగరంలో గాలివాన కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, అనంతసాగరం మర్రిపాడు, పొదలకూరు తదితర ప్రాంతాల్లో వాన పడింది.

యువకుడిని కాపాడిన మెరైన్ పోలీసులు

ఇందుకూరుపేట: సముద్రంలో మునిగిపోయిన యువకుడిని మెరైన్ పోలీసులు కాపాడారు. ఈ ఘటన మండలంలోని మైపాడు బీచ్‌లో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజాపతి అనే యువకుడు నెల్లూరులో నివాసం ఉంటూ టైల్స్ పనులు చేస్తున్నాడు. సముద్ర స్నానం చేసేందుకు మండలంలోని మైపాడు బీచ్‌కు స్నేహితులతో శుక్రవారం వచ్చాడు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన మెరైన్ హెడ్‌కానిస్టేబుల్ వర్ధన్, కానిస్టేబుల్ రాజు, హోంగార్డ్ వెంకటేశ్వర్లు అతడిని కాపాడారు. ప్రథమ చికిత్స చేసి వైద్యశాలకు తరలించారు. ప్రజాపతి క్షేమంగా ఉన్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.


యువకుడిని ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులు

చోరీ కేసుల్లో ఇద్దరికి ఏడాది జైలు

నెల్లూరు(లీగల్): వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలు చేశారని నమోదైన కేసుల్లో నెల్లూరు రూరల్ బుజబుజనెల్లూరు వికలాంగులకాలనీ ప్రాంతానికి చెందిన షేక్ ఖలీల్, ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం కొండరాజుపల్లి గ్రామానికి చెందిన కొండరాజు సురేష్‌కు శిక్ష ఖరారైంది. ఏడాది జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ నెల్లూరు ఐదో అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జి.దేవిక శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఖలీల్ వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్, అనుమానితుడిగా నమోదై ఉన్నాడు. సురేష్ దొంగతనాలు చేస్తుంటాడు. వీరిద్దరూ స్నేహితులయ్యారు. వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తల్పగిరికాలనీ ప్రాంతానికి చెందిన జ్యోతి జూనియర్ లెక్చరర్. ఆమె భర్త శ్రీనివాసులు హైదరాబాద్‌లో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారు. జ్యోతి 2023 జూన్ 8వ తేదీన వ్యక్తిగత పనిపై ఒంగోలుకు వెళ్లింది. మరుసటిరోజు ఆమె ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తెరిచినట్టు ఉందని బంధువులు సమాచారం ఇచ్చారు. జ్యోతి వెంటనే తన ఇంటికి చేరుకుని చూడగా బీరువాలోని రూ.1.80 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, టీవీ చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేసి ఖలీల్, సురేష్‌ను పట్టుకున్నారు. విచారణలో జ్యోతి ఇంట్లో జరిగిన దొంగతనంతోపాటు వివిధ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేసుల్లో ఇద్దరి హస్తం ఉన్నట్టు తేలింది. వారి నుంచి బంగారు ఆభరణాలు, ఏడు మోటార్‌బైక్‌లను మధ్యవర్తుల సమక్షంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎస్.కల్పన వాదించారు.

పాతకక్షలతోనే యువకుడి హత్య


వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య

- గంటల వ్యవధిలోనే నిందితుల అరెస్ట్
- రాజకీయ ప్రమేయం లేదన్న ఏఎస్పీ

నెల్లూరు(క్రైమ్): యువకుడి హత్య కేసులో నిందితులను 24 గంటలు గడవక ముందే నెల్లూరు వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో శుక్రవారం రాత్రి ఏఎస్పీ సీహెచ్ సౌజన్య హత్యకు దారి తీసిన పరిస్థితులు, నిందితుల వివరాలను వెల్లడించారు. నెల్లూరు రామకోటయ్యనగర్‌కు చెందిన పి.చంద్రశేఖర్ అలియాస్ చందుకు అదే ప్రాంతానికి చెందిన దేవానంద్‌కు గతంలో విభేదాలున్నాయి. గతేడాది జూన్ 29వ తేదీ రాత్రి దేవానంద్, అతని స్నేహితులైన శేఖర్, నీతిరాజు, జీవన్‌సాగర్, వెంకట్, మోజెస్ కలిసి చందుపై హత్యాయత్నం చేశారు. అప్పటి నుంచి చందు తనపై దాడి చేసిన వారిలో ముఖ్యులైన దేవానంద్, నీతిరాజ్‌పై కక్ష పెంచుకున్నాడు. ఈనెల నాలుగో తేదీ సాయంత్రం రామకోటయ్యనగర్ హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలోని వసుంధరానగర్‌లోని ఖాళీ స్థలంలో చందు తన స్నేహితులు రెహ్మాన్, ఆస్మిత్, శ్రీనివాసులు, సుమంత్‌తో కూర్చొని మద్యం తాగుతున్నాడు. ఆ సమయంలో నీతిరాజు షేక్ అఫ్రోజ్‌తో కలిసి సమీపంలోని బార్ వద్ద ఉన్నట్లు చందుకు సమాచారం అందింది. అతను గతంలో జరిగిన గొడవల విషయమై మాట్లాడుకుందామని నీతిరాజును వారు ఉన్న ప్రదేశానికి రప్పించి హత్య చేసి పరారయ్యారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణ కేసు నమోదు చేశారు. నగర, సీసీఎస్ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, రామకృష్ణాచారి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతికత ఆధారంగా వారు శుక్రవారం తెలుగుగంగ కాలనీ వద్ద ఉండగా ఇన్‌స్పెక్టర్ అరెస్ట్ చేశారు. పాతకక్షల నేపథ్యంలోనే నీతిరాజు హత్య జరిగిందని, ఈ కేసులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని ఏఎస్పీ వెల్లడించారు. నిందితులపై రౌడీషీట్లు తెరుస్తామన్నారు. సమావేశంలో ఎస్సై శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

- 16 వాహనాల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): మోటార్‌బైక్ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఇద్దరు దొంగలను నెల్లూరు దర్గామిట్ట, బాలాజీ నగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 16 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో శుక్రవారం నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి నిందితుల వివరాలను వెల్లడించారు. మనుబోలు మండలం పిడూరు గ్రామానికి చెందిన మురళి అలియాస్ మురళీకృష్ణ జల్సాలకు, చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. నగదు కోసం బైక్ దొంగగా అవతారమెత్తాడు. మారుతాళాలతో దర్గామిట్ట, ఇందుకూరుపేట, బిట్రగుంట పోలీసుస్టేషన్ల పరిధిలో ఇళ్లు, రహదారులపై పార్క్ చేసి ఉన్న బైక్‌లను దొంగతనం వాటిని అమ్మి సొమ్ము చేసుకోసాగాడు. వరుస బైక్ దొంగతనాల నేపథ్యంలో దర్గామిట్ట పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుడిని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం అరెస్ట్‌చేసి రూ.3 లక్షల విలువచేసే 9 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ముళ్లపొదల్లో దాచి..

నెల్లూరు నగరంలోని వనంతోపు నక్కలగుంటకు చెందిన రాజు, ప్రేమ్‌కుమార్ స్నేహితులు. వారు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సంపాదించిన సొమ్ము వ్యసనాలు తీర్చుకునేందుకు చాలక పోవడంతో బైక్ దొంగలుగా అవతారమెత్తారు. మారుతాళాలతో వాహనాలను దొంగతనం చేయసాగారు. వాటిని ఒకేసారి అమ్మాలని నిర్ణయించుకుని పద్మావతి గ్రీన్‌సిటీలో ముళ్లపొదల్లో దాచిపెట్టారు. బైక్ దొంగతనాల కట్టడికి బాలాజీనగర్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. శుక్రవారం రాజు బైక్‌లను అమ్మేందుకు పద్మావతి గ్రీన్‌సిటీ వద్ద స్నేహితుడు ప్రేమ్‌కుమార్ కోసం వేచి ఉండగా పోలీసులు అరెస్ట్‌చేశారు. రాజు వద్ద నుంచి రూ.2.30 లక్షలు విలువచేసే ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రేమ్‌కుమార్ కోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. బైక్ దొంగలను అరెస్ట్ చేసిన దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్, బాలాజీ నగర్ ఎస్సై షేక్ మహబూబ్ సుభాని వారి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ రామకృష్ణాచారి, కృష్ణపట్నం పోర్టు సీఐ వెంకటరెడ్డి, బాలాజీ నగర్ ఎస్సై విజయశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లు

నేటి నుంచి తైక్వాండో పోటీలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఉన్న షాదీమంజిల్‌లో శని, ఆదివారాల్లో ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి తైక్వాండో 8వ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు తైక్వాండో అసోసియేషన్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ సబ్ జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలను జరుగుతాయని జిల్లా కోశాధికారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉయ్యాల పవన్ కుమార్ పేర్కొన్నారు.